

# నవభూమి

## కరీంనగర్

అనుబంధం

21 మే,2025 బుధవారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


# ఆఫ్‌లైన్ దరఖాస్తులెక్కడ?



**రామగుండం -నవభూమి:** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌కు చెందిన ఓ యువకుడు రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా 2 లక్షల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఆన్‌లైన్‌లో పని చేయకపోవడంతో గడువు పొడిగించిన తర్వాత ఆఫ్‌లైన్‌లో సమర్పించాడు. అనంతరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సైతం పిలుపు రావడంతో బ్యాంకర్లకు తాను దరఖాస్తు చేసుకున్న యూనిట్ గురించి వివరించాడు. బ్యాంకర్ సైతం రుణం ఇచ్చేందుకు ఓకే అన్నాడు. క్రెడిట్ స్కోర్, బ్యాంక్ ట్రాన్జాక్షన్ చూసిన బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్.. కార్పొరేషన్ నుంచి వచ్చిన జాబితాలో పేరు లేదని చెప్పడంతో ఆందోళనలో చెందాడు ఇదేంటని కార్పొరేషన్ అధికారులను అడిగితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వాళ్లవి మాత్రమే పంపించామని చెప్పడంతో అవాక్కయ్యాడు. ఒక్క ఈ యువకుడే కాదు.. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వందలాది మంది పరిస్థితి ఇలాగే మారింది. పెద్దపల్లి, మే 19(నమస్తే తెలంగాణ): రాజీవ్ యువ వికాస్ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 14లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం కాగా, వరుస సెలవులు రావడంతో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాలేదు. ఏప్రిల్ 14 తర్వాత ఆన్‌లైన్ పనిచేయకపోవడంతో ప్రభుత్వం అదే నెల 24వ తేదీ వరకు ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరించింది. దీంతో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలతోపాటు ఆయా మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. తీరా చూస్తే ప్రభుత్వం ఆన్‌లైన్ దరఖాస్తుదారుల సంఖ్య మాత్రమే చెబుతున్నది. ఆఫ్‌లైన్ లెక్కలు చెప్పకపోవడంపై అనుమానాలకు తావిస్తున్నది. ఒక్క పెద్దపల్లి జిల్లాలోనే ఆఫ్‌లైన్‌లో వెయ్యికి పైగా వచ్చిన దరఖాస్తుల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. జూన్ ఒకటి కల్లా యూనిట్ల మంజూరు పత్రాలను సిద్ధం చేయాలని అధికారులు చెప్పడంతో ఆఫ్‌లైన్ దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పరిశీలన కోసమే పిలుపుఆఫ్‌లైన్ దరఖాస్తులను సైతం పరిగణలోకి తీసుకుంటున్నామనే నమ్మకం కలిగేలా అధికారులు జిల్లాలో నిర్వహించిన దరఖాస్తుల పరిశీలనకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వారందరినీ పిలిచారు. దీంతో ఆఫ్‌లైన్ దరఖాస్తుదారులకు ఎలాంటి అనుమానం రాలేదు. తాజాగా ఒక్కో దరఖాస్తుదారుడికి తాము పెట్టుకున్న బ్యాంకు నుంచి పిలుపు వచ్చింది. వారి సిబిల్ స్కోర్, ఇతర బ్యాంకు లావాదేవీలను పరిగణలోకి తీసుకొని ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ఈ సమయంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి పిలుపు రాలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా దాదాపుగా వెయ్యి మంది వరకు నష్టపోయే ప్రమాదం ఏర్పడగా, దరఖాస్తు చేసుకున్న వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందే స్పష్టత ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెబుతున్నారు.

## దళితులను

# పట్టించుకోని బీఆర్ఎస్



**పెద్దపల్లి-నవభూమి:** అధికారంలో ఉన్న పదేళ్ళలో దళితులను పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జడ్పీ చైర్మ న్ దళిత హక్కుల గురించి మాట్లాడడం సిగ్గు చేటని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావులు అన్నారు. సోమవారం ఆర్కేగార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సంబంధం లేని విషయాల్లో తలదూర్చడం ఎందుకని ప్రశ్నించారు. పుష్కరాల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వ ర్యంలో జరుగుతోందని, ప్రొటోకాల్ వ్యవహారం సీఎం, అధికారులు చూసుకుంటారని, కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యమెందుకని ప్రశ్నించారు. పెద్దపల్లి ఎంపీకి కూడా పుష్కారాల సమాచారం అందిం చారని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా మంత్రి శ్రీధర్‌బాబు సతీమణి ఐఏఎస్ అధికారి శైలజా రామయ్యర్ నిబంధనల మేరకు సమాచార శాఖ ద్వారా ప్రకటనలు ఇచ్చి ఉంటారన్నారు. మంత్రి శ్రీధర్‌బాబును ఎదుర్కొనే దమ్ములేక మహిళా అధికారిపై పుట్ట మధు చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో దళితులను ఎలా ఇబ్బంది పెట్టారో ప్రజ లకు తెలుసన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంథని నియోజకవర్గంలో దళితులపై దాడులు, హత్యలు ప్రజలు మర్చిపోలేదన్నారు. రాజకీయా లకు సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకుని రాద్ధాంతం చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మంత్రి శ్రీధర్‌బాబు నాయ కత్వంలో ఎంపీ ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణ గెలుపొందారని గుర్తు చేశారు. తమ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తలదూరిస్తే చూస్తూ ఊరు కోమన్నారు. మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాష్ రావు, నాయకులు బండారి రాంమూర్తి, మస్రత్, నూగిల్ల మల్లయ్య, జడల సురేందర్, అవినాష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, ధీటి బాలరాజు, పడాల కొమురయ్య, బూతగడ్డ సంపత్, సుధాకర్‌రెడ్డి, అమరేష్, పాల్గొన్నారు.

## సీలింగ్ భూముల్లో

# అక్రమ రిజిస్ట్రేషన్లు



2

## భారత సైనికుల సాహసాలను కళ్లారా చూశాను



2

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**పెద్దపల్లి-నవభూమి:** పజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన ప్రతాప్ గ్రామ శివారు సర్వే నెంబర్ 48లో గల 27 గుంటల భూమి మాజీ సర్పంచ్ ఆకుల గట్టయ్య అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, తనకు భూమి ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా మంథని ఆర్డీవోకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దపల్లి పట్టణం బం డారి కుంటకు చెందిన శ్రీధర్ 34వ వార్డులో ఉన్న భూమిని అంజయ్య అనే వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణం చేశాడని, దీనిపై విచారించి చర్యలు తీసుకో వాలని కోరారు. సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన కొదురుపాక రైతులు చెరువు కట్ట నుంచి పొలాలకు వెళ్లే రోడ్డుకు బండలు వేసి రాకపోకలు నిలిపి వేస్తున్నారని దరఖాస్తు అందజేశారు. పెద్దపల్లి పట్ట ణానికి చెందిన షహీదా బేగం ఇద్దరు పిల్లలతో ఒంటరిగా జీవిస్తున్నానని, పదో తరగతి వరకు చదివానని, ఉపాధి చూపించాలని దరఖాస్తు చేసు కోగా వారధి సొసైటీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా వాణిలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



**పెద్దపల్లి -నవభూమి:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లి మెంటరీ పరీక్షలు ఈనెల 22నుంచి 28వరకు జరుగుతాయని, వీటి నిర్వహ ణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారు లను ఆదేశించారు. సోమవారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమా వేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 13 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12గంటల, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్ష జరుగుతాయని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 2,538మంది హాజరవుతారని, పరీక్షలను పకడ్బం దీగా నిర్వహించేందుకు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించాల న్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీ సర్ పాల్గొంటారని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిం చాలన్నారు. సీసీ కెమెరా నిఘాలో ప్ర?శ్నపత్రాలు తెరువాలని, కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వైద్యసదుపాయాలు కల్పించాలని సూచించారు. జిల్లా ఇంటర్మీ డియట్ నోడల్ అధికారి కల్పన, డీఈవో మాధవి పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ కీలక పాత్ర

**వేములవాడ-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రజతోత్సవ పోస్టర్ ను మంగళవారం వేములవాడలో రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వివిధ ప్రజా సంఘాలను రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు.అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో మాక్ అసెంబ్లీ, ఛలో ఢిల్లీ,సాగర హారం, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను చేసిన ఘనత టీజేఎఫ్ దక్కిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్, ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, ఎలక్ట్రానిక్ మీడియా టెంజు అధ్యక్షులు ఇరుకుల ప్రవీణ్, సీనియర్ పాత్రికేయులు గరుదాసు ప్రసాద్, సయ్యద్ అలీ,దేవరాజ్, దెబ్బేటి ప్రవీణ్, నాగరాజు, ప్రసాద్, సాయి, సోహెల్, హరీష్, జబ్బార్, తో పాటు పెద్ద ఎత్తున జర్నలిస్టులతోపాటు ఉన్నారు.

# సీలింగ్ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు



**కరీంనగర్ -నవభూమి:** జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తపల్లిలో సీలింగ్ పరిధిలో ఉన్న భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి రియల్ మాఫియా, దళారులు అధికారులతో కలిసి లక్షల్లో దండుకున్నారు. ఈ అక్రమాలపై ముప్పై ఏళ్ల క్రితమే కొందరు హైకోర్టులో ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్ విచారణ జరిపించి అవి సీలింగ్ భూములని తేల్చిచెప్పారు. ఆ భూముల్లో ఎలాంటి లావాదేవీలు చేయవద్దని హైకోర్టు అధికారులను ఆదేశించింది. కొందరు వ్యక్తులు మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో ఆ వ్యవహారం వాయిదాల్లో నానుతూ వచ్చింది. భూముల వ్యవహారం కోర్టులో ఉండగానే కొందరు రియల్ వ్యాపారులు రంగప్రవేశం చేసి అధికారులు, ఇతరుల అండతో ఆ భూముల్లో 476 రిజిస్ట్రేషన్లు చేసి జేబులు నింపుకున్నారు. మళ్లీ ఈ వ్యవహారాన్ని కొందరు లోకాయుక్త దృష్టికి తీసుకువెళ్లగా లోకాయుక్త కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ భూములను సీలింగ్ భూములుగా పేర్కొంటూ కలెక్టర్ ఆయా రిజిస్ట్రేషన్లను రద్దు చేయాల్సిందిగా గంగాధర సబ్ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు.మూడు సర్వే నంబర్లు.. 456 రిజిస్ట్రేషన్లు కొత్తపల్లి శివారులోని సర్వే నంబర్ 175, 197, 198 భూములకు సంబంధించిన దాదాపు 465 రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేశారు. ఆ భూములు సీలింగ్ లాండ్ కిందకు వస్తాయని, అందులో రిజిస్ట్రేషన్లు చేయవద్దని 1995లో ఒక ఫిర్యాదుపై విచారణ చేయాలని అప్పటి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ చేసిన కలెక్టర్ ఆ భూములన్నీ సీలింగ్ పరిధిలో ఉన్నట్టు హైకోర్టుకి నివేదించారు. దీంతో హైకోర్టు ఆ భూములపై ఎలాంటి లావాదేవీలు జరపవద్దని జిల్లా యంత్రాంగానికి సూచించింది. ఆ సమయంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కోర్టుని ఆశ్రయించారు. అప్పటి నుంచి ఆ భూములు విచారణ దశలోనే కొనసాగుతున్నాయి. ఆ కేసు అలా పెండింగ్ లో ఉండగానే కొంతమంది వ్యక్తులు ఆ భూముల్లో యథేచ్ఛగా లావాదేవీలు జరుపుతున్నారు.లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఫిర్యాదుతో..భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై లోక్‌సత్తా ఉద్యమ సంస్థ 2015 సంవత్సరంలో లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన లోకాయుక్త ఆ భూములకు సంబంధించిన లావాదేవీలపై పూర్తి వివరాలు తమకి సమర్పించాలని ఆదేశిస్తూ, ఇక ముందు ఎలాంటి లావాదేవీలు జరపవద్దని రెవిన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. లోకాయుక్త సూచన మేరకు ఆ మూడు సర్వే నంబర్లలో అప్పటివరకు జరిగిన లావాదేవీలను లోకాయుక్తకు రెవిన్యూ శాఖ సమర్పించింది. అనంతరం ఆ భూముల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖకు రెవిన్యూ శాఖ సూచించింది. ఇంతలో లోకయుక్తాకు ఫిర్యాదు చేసిన లోక్ సత్తా ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ మరణించడం, లోకాయుక్తలో విచారణ ఆగిపోవడం కబ్జారాయుళ్లకు కలిసి వచ్చింది. ఇదే అదునుగా గంగాధర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని కొంతమంది అవినీతి అధికారులు సీలింగ్ ల్యాండ్ కేసు విచారణను తొక్కిపెట్టి, యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేయడం ప్రారంభించారు. దీంతో 476 డాక్యుమెంట్లు చేతులు మారాయి. ఈ క్రమంలో లోకాయుక్తా తిరిగి విచారణ వేగవంతం చేసింది. నిషేధం ఉన్న భూముల్లో రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరుగుతున్నాయని గమనించి 2024లో మళ్లీ రెవిన్యూశాఖను హెచ్చరించింది. తక్షణం రిజిస్ట్రేషన్లు నిలిపివేయాల్సిందిగా రిజిస్ట్రేషన్ల శాఖను ఆదేశించమని రెవెన్యూశాఖకు సూచించింది. ఇప్పటివరకు చేసిన లావాదేవీలన్నింటినీ రెండు రోజుల్లో రద్దు చేయాలని కరీంనగర్ ఆర్డీవో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు 2024 నవంబరు 14న లేఖ రాశారు. ఆర్డీవో లేఖ రాసి ఆరు నెలలు గడిచినా రిజిస్ట్రేషన్ల శాఖ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇదే విషయాన్ని ఆర్డీవో లోకాయుక్తాకు తెలియజేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన లోకాయుక్త తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించింది. రంగంలోకి దిగిన కలెక్టర్ పమేలా సత్పతి కొత్తపల్లిలోని సర్వేనంబర్లు 175, 197,198లో ఉన్న భూముల్లో ఇప్పటివరకు జరిగిన మొత్తం రిజిస్ట్రేషన్లను రద్దు చేయాల్సిందిగా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా గంగాధర సబ్‌రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా భూముల్లో జరిగిన 476 డాక్యుమెంట్లు తక్షణం రద్దు కానున్నాయి. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో ఉన్న భూముల వివరాలను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు, రెవిన్యూ శాఖకు అందించింది. ఆ భూముల్లో ఎలాంటి లావాదేవీలు జరుపకూడదని ఎప్పటికప్పుడు ఆ శాఖని హెచ్చరించింది. 1998, 2011, 2016, 2017, 2018లలో ఎనిమిది సార్లు రిజిస్ట్రేషన్ శాఖను రెవిన్యూ శాఖ అప్రమత్తం చేసింది. రిజిస్ట్రేషన్ల శాఖలోని కొంతమంది అవినీతి అధికారుల కారణంగా ఆ భూముల్లో కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగాయి. వందలాది డాక్యుమెంట్లు చేతులు మారాయి. రిజిస్ట్రేషన్ల శాఖ నిర్లక్ష్యం, అవినీతి అధికారుల బరితెగింపు వల్ల వందలాది కుటుంబాలు రోడ్డున పడనున్నాయి. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో ఉన్న ప్రభుత్వ భూములని తెలియక భూములు కొన్న సామాన్యుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..కొత్తపల్లికి సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్లు 2016 వరకు కరీంనగర్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగాయి. కొత్తపల్లి మండలం భూములు గంగాధర సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోకి వచ్చిన తరువాత 2018లో లోకాయుక్త ఆర్డర్‌తో ఒక రిజిస్ట్రేషన్ జరిగింది. అప్పటి నుంచి నవంబర్ 2024 వరకు గంగాధరలో 52 అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. అప్రమత్తమైన అధికారులు ఎట్టకేలకు ఈ సర్వే నంబర్లను నిషేదిత జాభితాల్లో చేర్చడంతో 11 నవంబర్ 2024 నుంచి ఇప్పటి వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగలేదు. అయితే ఈ భూములు నిషదిత జాభితాలో లేకపోవడంతో సదరు వ్యక్తులు తగిన చాలన్ చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని రిజిస్ట్రేషన్ అధికారులు చెప్పుతున్నారు. ఇప్పటి వరకు నిషేధిత జాభితాల్లో పై సర్వె నెంబర్లలో జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ ఈనెల 15న గంగాధర సబ్ రిజిస్ట్రార్‌కు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు చేయడానికి కొత్తపల్లి తహసీల్దార్‌తో సంప్రదించి చర్యలు తీసుకోనున్నట్లు గంగాధర సబ్ రిజిస్ట్రార్ అఫ్జల్ నూర్‌ఖాన్ తెలిపారు. **-నవభూమి:**

# భారత సైనికుల సాహసాలను కళ్లారా చూశాను

**గణేశ్‌నగర్,-నవభూమి:** ఆపరేషన్ సింధూర్ సందర్భంగా కంట్రోల్ రూం బాధ్యతలు నిర్వర్తిస్తూ భారత సైనికుల ధైర్యసాహసాలను కళ్లారా చూశానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో నరేంద్రమోదీ మంత్రివర్గంలో సభ్యుడిగా ఉంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగడం తన అదృష్టమని ఆయన అన్నారు. కరీంనగర్ తెలంగాణ చౌక్ నుంచి రాంనగర్ వరకు బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధానికి విరామం ఇచ్చామే తప్ప ముగియలేదని, దేశానికి ఆపదొస్తే టెర్రరిస్టుల అంతు చూసే వరకు విడిచి పెట్టబోమని హెచ్చరించారు. ఆపరేషన్ సింధూర్‌తో మన సైన్యం సత్తా యావత్ ప్రపంచానికి తెలిసిందన్నారు. పాకిస్థాన్ ప్రజల ప్రాణాలకు నష్టం లేకుండా ఉగ్రవాద శిబిరాలను ముట్టుపెట్టిన ఘనత మన సైనికులదేనని కొనియాడారు. ప్రధాన మోదీ నాయకత్వ పటిమను ప్రపంచమంతా మెచ్చుకుంటోందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో మన సైనికుల ధైర్యసాహసాలను గుర్తు చేస్తూ తిరంగా యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం హిందూ ఏక్తా యాత్ర పాటలు విడుదల చేశారు.



## అంగరంగ వైభవంగా సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం



**సుల్తానాబాద్ -నవభూమి:** సీతారామచంద్రస్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా కన్నుల పండుగలా జరిగింది. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల గ్రామంలోని సీతారామచంద్రస్వామి, సంకట విభజన రామభక్త వీర హనుమాన్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇవాళ వేద పండితుల మంత్రోత్సవంతో భక్తజన సమూహం మధ్య స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అఖండ దీపారాధన, పుణ్యా వచనం, అంకురారోపణ, ధ్వజారోహణం కార్యక్రమాలతోపాటు తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు భక్తమండలి సభ్యులు వంగపల్లి అనసూయ దేవి, సుగుణాకర్ తెలిపారు. ఇవాళ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మే 21న సీతారామచంద్రస్వామికి సామ్రాజ్య పట్టాభిషేకం, హవనము, బలిహరణం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

## బొమ్మనపల్లిలో అగ్ని ప్రమాదం.. రూ. 2 లక్షలకు పైగా నష్టం



**చిగురుమామిడి, -నవభూమి:** చిగురుమామిడి మండలంలో బొమ్మనపల్లి గ్రామంలో అర్ధరాత్రి సమయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన ముత్యాల కొమురయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి వద్ద సోమవారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రైతు కొమురయ్య పశువుల పాక ముందు ఉన్న 11కేవి విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తాకడంతో మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న పశువులపాకకు మంటలు అంటుకొని, 1200 గడ్డి కట్టలు దగ్ధమయ్యాయని బాధిత రైతు తెలిపాడు. ఈ ప్రమాదంలో ఆవు తీవ్రంగా గాయపడింది. డ్రిప్ వైర్లు, తార్పలిన్ కవర్లు, పశువులపాక పూర్తిగా కాలిపోయింది. రైతు కొమరయ్య అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల వరకు నష్టపోయానని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధ్యత రైతు కొమురయ్య ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.

## ప్రజల అభీష్టం మేరకు ముంబైకు లహరి ఏసి స్లీపర్ బస్సు సర్వీసు

**వేములవాడ -నవభూమి:** ప్రజల అభీష్టం మేరకు ముంబై కు లహరి స్లీపర్ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం వేములవాడ చెరువు కట్ట గుడి ప్రాంగణం వద్ద వేములవాడ నుంచి ముంబై వరకు వెళ్లే రెండు ఏసీ బస్సులను రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ,ఎస్పి మహేష్ బి.గీతే,లతో కలిసి పూజ చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు మే 20 నుంచి వేములవాడ నుండి ముంబై వెళ్ళేందుకు ఏసీ స్లిపర్ బస్సు లహరి సర్వీసులను ప్రారంభిస్తున్నామని అన్నారు. 2 లహరి సర్వీస్ ఏసీ బస్సులను ముంబై సర్వీస్ నిమిత్తం కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వేములవాడ నుండి బయలు దేరి తెల్లారి ఉదయం 4.45 గంటలకు ముంబై కు చేరుకుంటుందని, అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ముంబై నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు వేములవాడ చేరుకుంటుందని తెలిపారు. ప్రతిరోజు ముంబై నగరానికి అప్ అండ్ డౌన్ సర్వీస్ నడుస్తుందని అన్నారు.

### కేసీఆర్‌కు నోటీసులు..

# స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు

**పెద్దపల్లి-నవభూమి:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం పెద్దపల్లిలో మంత్రి శ్రీధర్ బాబు విలేకర్లుతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు. నోటీసులు ఇప్పుడే కదా ఇచ్చింది.. ఆయన వెళ్తారనే తాను అనుకుంటున్నానన్నారు. అయితే చట్టం ముందు అందరూ సమానమేనని ఆయనని చెప్పారు. తప్పు చేయక పోతే భయం ఎందుకు అంటూ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరంలో తనపై కేసీఆర్ పెట్టిన కేసులు ఎదుర్కొన్నానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన తప్పేం లేదంటూ కేసును కోర్టు కొట్టేసిందన్నారు. ఎనిమిదేళ్ల పాటు.. ఈ కేసులతో పోరాడానని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మరోవైపు గత కేసీఆర్ ప్రభుత్వం లక్షల కోట్లాది రూపాయలు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించింది. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ ప్రాజెక్ట్‌లోని కొన్ని పిల్లర్లు కుంగాయి. ఈ నేపథ్యంలో దీనిని నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రచారాస్త్రంగా మలుచుకొంది. తాము అధికారంలోకి వస్తే.. దీనిపై విచారణ జరిపిస్తామని ప్రకటించింది. ఇక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో జస్టిస్ పిసి ఘోష్ సారథ్యంలో కమిషన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్.. ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంపై విచారణ చేపట్టింది. అందులోభాగంగా ఇప్పటికే వరకు ఉన్నతాధికారులు విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేసింది. అయితే తాజాగా నాటీ సీఎం కేసీఆర్‌తోపాటు ఆయన హయాంలో ఆర్థిక శాఖ మంత్రులుగా పని చేసిన ఈటల రాజేందర్, హరీశ్ రావులకు సైతం నోటీసులు జారీ చేసింది. వీరింతా విడివిడిగా విచారణకు హాజరుకావాలంటూ జారీ చేసిన నోటీసుల్లో కమిషన్ స్పష్టం చేసింది. దీంతో కేసీఆర్.. ఈ విచారణకు హాజరువుతారా? లేదా అన్న సందేహం పలువురిలో వ్యక్తమవుతోంది.



# టోల్‌గేట్ వద్ద సౌకర్యాలు కల్పించాలి



**పాలకుర్తి, -నవభూమి:** కన్నాల టోల్ గేట్ వద్ద సర్వీస్ రోడ్లతోపాటు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కా న్‌సింగ్ టోల్‌గేట్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు, కన్నాల లారీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియే షన్ ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా బూమ్ బారియర్లను ఎత్తి వేసి ఆందోళనకు దిగారు. పుట్నూర్‌లో మండల వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీలుగు విత్త నాల పంపిణీ కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్యే టోల్ ప్లాజా వద్ద ఆగి అక్కడి పరిస్థితులపై మాట్లాడారు. ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలపై ,సర్వీస్ రోడ్ల నిర్వహణపై జరుగుతున్న నిర్లక్ష్యంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టోల్‌గేట్ నిర్వా హకులు ప్రజలు, ప్రయాణికులపై చూపుతున్న నిర్ల క్ష్యంపై మండిపడ్డారు. 15 సంవత్సరాలుగా టోల్ వసూళ్ల ద్వారా అధిక లాభాలు పొందుతున్న సంస్థ, ప్రజల భద్రతకు అవసరమైన సర్వీస్ రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ఉద్యోగులకు వేత నాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు లోడు తీసుకెళ్లి తిరిగి వస్తున్న లారీలకు టోల్ మాఫీ కల్పించాలని ఎమ్మెల్యే అభిప్రా యం వ్యక్తం చేశారు. టోల్‌గేట్‌కు 20 కిలోమీటర్ల లోపు వాహనాలను స్థానిక వాహ నాలుగా గుర్తించి ఉచితంగా రాకపోకలు కొన సాగించాలని సూచించారు. మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కన్నాల సహకార సంఘం చైర్మెన్ బయ్యపు మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసి పాత భాగ్యలక్ష్మి రవిందర్ నాయకులు, కార్యకర్తలు, లారీ అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు. పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్ కుమార్, బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

### ప్రభుత్వ స్కూళ్లను బతికించుకోవాల్సిన

# అవసరం ఉంది : ఎంఈఓ నరేష్

**కోరుట్ల, -నవభూమి:** పాఠశాల స్థాయి నుంచి విద్యను బలోపేతం చేయాలని మండల విద్యాధికారి గంగుల నరేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇవాళ ఆన్ కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ప్రైమరీ స్కూల్ టీచర్స్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ తరగతులను ఎంఈఓ గంగుల నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విషయ పరిజ్ఞానంతోపాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ( %ూ×%) ద్వారా బోధన మెరుగుపరచాలని అన్నారు. విద్యార్థులకు బోధన సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. భావవ్యక్తీకరణ, విషయ పరిజ్ఞానంపై ఆసక్తికరమైన విధంగా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. పాఠశాల స్థాయిలో విద్యా విధానాన్ని మరింత బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవలసిన అవసరం ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు అందే శివప్రసాద్, సిరిపురం శ్రీనివాస్, అంకం దామోదర్, గంగుల రణధీర్, అన్నం మహేష్, మాసం చిరంజీవి, కోసరి శేఖర్, సీఆర్పీలు గంగాధర్, దేవేందర్, సత్యనారాయణ, మన్విత, జ్యోతి, కంప్యూటర్ ఆపరేటర్ రాజేశ్వర్, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## 21 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు




**కొత్తపల్లి, -నవభూమి:** ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నామని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ ఆగంరావు తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆరు క్రికెట్ జట్లను ఎంపిక చేశామని, అండర్-25 విభాగంలో మొదట లీగ్ పద్ధతిలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఎకువ పాయింట్లు సాధించిన నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు ప్రవేశిస్తాయని తెలిపారు. ఫైనల్‌కు చేరిన ఇరు జట్లకు మ్యాచ్ నిర్వహించి విజేతను ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జూన్‌లో హైదరాబాద్‌లో జరిగే హెచ్‌సీఏ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తామని, ఆ జట్టు ఉమ్మడి జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఈ పోటీల్లో కరీంనగర్ నుంచి రెండు జట్లు, వేములవాడ నుంచి ఒకటి, జగిత్యాల నుంచి ఒకటి, గోదావరిఖని నుంచి ఒకటి పాల్గొంటాయన్నారు.అలాగే, అండర్-19, అండర్-16, అండర్-14 విభాగాల్లోనూ ఆరు జట్ల చొప్పున ఎంపిక చేశామని, వీటికి విడుతల వారీగా పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. హెచ్‌సీఏ సౌజన్యంతో నిర్వహిస్తున్న అండర్-25 క్రికెట్ లీగ్ పోటీలను మొదట కరీంనగర్‌లోని సెయింట్ ఆల్ఫోన్స్ మైదానంలో ప్రారంభిస్తామని, శాతవాహన యూనివర్సిటీ మైదానం, వేములవాడలో పోటీలు జరుగుతాయని, ఈ నెల 21 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. మొత్తం 15 లీగ్ మ్యాచ్‌లు, ఒక ఫైనల్ మ్యాచ్ ఉంటాయన్నారు. ఇరు జట్లు మొదటి రోజు 50 ఓవర్ల చొప్పున ఒక ఇన్నింగ్స్‌ను, రెండో రోజు 40 ఓవర్ల చొప్పున ఒక ఇన్నింగ్స్ ఆడతాయన్నారు. ఈ పోటీలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించేందుకు హెచ్‌సీఏ అవకాశం కల్పించిందన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా క్రికెటర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు కే మహేందర్‌గౌడ్, సంఘ సభ్యులు అజిత్ కుమార్, హరికృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి

**ధర్మారం-నవభూమి:** బొమ్మారెడ్డిపల్లిలో మరణించిన గొర్రెలకు కలెక్టర్ ప్రత్యేక నిధి ద్వారా పరిహారం చెల్లించాలని, బాధిత గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్ కోరారు. గ్రామానికి చెందిన ఐదుగురు గొర్రెల పెంపకందారులకు చెందిన 96 గొర్రెలు ఇప్పటికే మృతి చెందగా, సోమవారం మరో ఏడు గొర్రెలు మరణించాయి. సమాచారం తెలుసుకున్న కొప్పుల ఈశ్వర్ సోమవారం ఆ గ్రామానికి వెళ్లి గొర్రెల పెంపకం దారులను పరామర్శించారు. గొర్రెల మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వందకు పైగా గొర్రెలు మేతకు వెళ్లి విషాహారం తిని మరణించడం బాధాకరమన్నారు. మూగజీవాల మృతి వల్ల గొర్రెల పెంపకందారులకు తీవ్రమైన నష్టం వచ్చిందన్నారు.వారు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక గొర్రెల పథకం ప్రస్తుతం లేనందున కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి తన నిధి ద్వారా పరిహారం చెల్లిస్తేనే నష్టపోయిన బాధిత గొర్రెల పెంపకందారులకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రత్యేక గొర్రెల పథకం ఉండడం వలన ప్రమాదవశాత్తు సామూహికంగా పెద్ద సంఖ్యలో మరణిస్తే గొర్రెల స్థానంలో తిరిగి వారికి తమ ప్రభుత్వం ఇచ్చేదని అన్నారు. కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. కొప్పుల వెంట నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు పూస్కూరు రామారావు, గుర్రం మోహన్‌రెడ్డి, గాగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి,దాడి సదయ్య, మిట్ట తిరుపతి, ఎగ్గెల స్వామి, గడ్డం మహిపాల్‌రెడ్డి, సంకరి నర్సింగం, పాక వెంకటేశం, ఆవుల లత, దేవి నలినీకాంత్, దేవి వంశీక్రిష్ణ, ఆవుల వేణు,ఐత వెంకటస్వామి,అజ్మీర మల్లేశం పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలి : ఏఐటీయూసీ



**జగిత్యాల, -నవభూమి:** శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండి ముక్రంలు డిమాండ్ చేశారు. ఇవాళ ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టిన అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రిటీష్ పాలనలో స్వతంత్ర పోరాటమునకు ముందు నుంచి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి.. నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి పెట్టుబడి దారులకు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉండే విధంగా అమలు చేయటానికి తీవ్రంగా ప్రయత్నిస్తుందని ఆరోపించారు.నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల ఎనిమిది గంటల పనికి బదులు 12 గంటలు కార్మికులు ఉద్యోగులు పనిచేయవలసి ఉంటుందన్నారు. అసంఘటిత రంగ కార్మికులైన బీడీ, అంగన్‌వాడీ, ఆశ, హమాలి, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు అమలు లేవని.. సమాన పనికి సమాన వేతనం లేదని కేంద్ర ప్రభుత్వం వీరిని స్కీం వర్కర్లుగా గుర్తించడం లేదని సుప్రీంకోర్టు తీర్పును కూడా అమలు చేయడం లేదని విమర్శించారు.సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంఘాలు, ఆల్ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె మే 20న తలపెట్టినట్టు వారు తెలిపారు. కశ్మీర్‌లో టూరిస్టులపై, అమాయక ప్రజలను ఉగ్రవాదులు దాడి చేసి చంపడం వల్ల మన సైనిక దళాలు బార్డర్‌లో యుద్ధ వాతావరణం నెలకొన్న దృష్ట్యా శాంతి వాతావరణంలో చర్చలు జరుగుతున్న సమయంలో కేంద్రంలోని కార్మిక సంఘాలు చర్చించి ఈ సమ్మెను జూలై 9న తిరిగి చేపడతామని నిర్ణయించినట్లు తెలిపారు. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని రాములు, ముక్రంలు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నేతలు ఇరుగురాల భూమేశ్వర్, వెన్న మహేష్, రామిల్ల రాంబాబు, మునుగూరు హనుమంతు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణతో యువత ఉపాధికి బాటలు




**రామగిరి, -నవభూమి:** వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. ఇవాళ రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని ఎంవీటీసీ నందు సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ (నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం)ను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.విశిష్ట అతిథిగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అధ్యక్షత వహించి, సింగరేణి సంస్థ ద్వారా పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో ఉచితంగా ఇస్తున్న శిక్షణ గురించి తెలియజేశారు.అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ నిరుద్యోగ యువతీ యువకుల్లో వృత్తి నైపుణ్యత పెంచి, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వివిధ ఏరియాల్లో ఇలాంటి శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తుందన్నారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా సుమారు 36 కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వబడుతుందని, అలాంటి శిక్షణా కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు.త్వరలో రాష్ట్రంలో స్కిల్ సర్వే..నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందే అభ్యర్థులు సర్టిఫికెట్ కోసమే కాకుండా, పూర్తిస్థాయిలో శిక్షణ పొంది నిజమైన నైపుణ్యాన్ని సాధించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందని, త్వరలో రాష్ట్రంలో స్కిల్ సర్వే నిర్వహించి, నిరుద్యోగులకు వివిధ విభాగాలలో ఉన్నటువంటి నైపుణ్యత ఆధారంగా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. సింగరేణి యాజమాన్యం ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఒక కళాశాలగా అభివృద్ధి చేసి, ఇక్కడి నుండే నియామకాలు చేపట్టే విధంగా కృషి చేయాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ జె అరుణశ్రీ, హెచ్ఆర్‌డీ విభాగం జనరల్ మేనేజర్ గుంజపడుగు రఘుపతి, రామగుండం-1 ఏరియా జనరల్ మేనేజర్ డి లలిత్ కుమార్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘ నాయకుడు కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.నరసింహులు, ఆర్.డి.ఓ. సురేష్, ఎస్వో టు జిఎం బి.వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ ఆశా వర్కర్ల భిక్షాటన



**చిగురుమామిడి, -నవభూమి:** దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా చిగురుమామిడి మండలానికి చెందిన ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు ఇవాళ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఆశా కార్యకర్తల వేతనం పెంచాలని, మూడవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఆహార భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ భిక్షాటన కార్యక్రమంలో ఆశా వర్కర్లు మారేళ్ల శ్రీలత, బెజ్జంకి సరోజన, బందారు సరోజన, పుష్ప, అంజలి, కవిత, తార, శ్వేత, సాహిదా బేగం, మంజుల, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి రెవెన్యూ పరిధిలో 476 రిజిస్ట్రేషన్లు రద్దు!



**గంగాధర, -నవభూమి:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని 175, 197, 198 సర్వే నంబర్లలో సుమారు 20 ఎకరాల భూమి ఉన్నది. దీనిపై 30 ఏండ్ల నుంచి సీలింగ్ యాక్ట్ అమలులో ఉన్నది. ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు జరపరాదని హైకోర్టు ఆర్డర్ ఉన్నది. కానీ, పదిహేనేండ్ల కాలంలో 175లో 3, 197లో 291, 198లో 182 రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో 2016 ఆగస్టు 23న సదరు సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చాలని కలెక్టర్ కార్యాలయం నుంచి అప్పటి కరీంనగర్‌రూరల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు నోటీసులు అందాయి. అప్పటి వరకు (2018) కరీంనగర్ రూరల్ పరిధిలో ఉన్న కొత్తపల్లి మండలాన్ని గంగాధర సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు మార్చారు. కానీ, అప్పటికే 424 రిజిస్ట్రేషన్లు చేశారు. 2018 తర్వాతి నుంచి 2024 వరకు గంగాధర పరిధిలో 52 రిజిస్ట్రేషన్లు చేశారు. అందులో ఒకటి మాత్రమే లోకాయుక్త ఆదేశాల మేరకు జరిగినట్టు తెలిసింది. కాగా, కొత్తపల్లి భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లపై లోక్‌సత్తా నాయకులు పోరాటం చేస్తూ వచ్చారు. ఆ మూడు సర్వే నంబర్లపై 1995లో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ జరపాలని అప్పటి కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ మేరకు కలెక్టర్ విచారణ జరిపి సదరు సర్వే నంబర్లలోని భూములు సీలింగ్ పరిధిలో ఉన్నట్టు హైకోర్టుకు నివేదిక అందించారు. దాని ప్రకారం సదరు భూములపై ఎలాంటి లావదేవీలూ జరపొద్దని హైకోర్టు ఆదేశాల జారీ చేసింది. అదే సమయంలో కొంతమంది వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగా, అప్పటి నుంచి విచారణ కొనసాగూతూనే ఉన్నది. కేసు పెండింగ్‌లో ఉండగానే కొందరు సదరు భూముల్లో అక్రమంగా లావాదేవీలు జరిపారు. దీనిని గుర్తించిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ 2015 లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. దాంతో విచారణ ప్రారంభించిన లోకాయుక్త, సదరు భూములపై పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని, ఇక ముందు ఆ భూములపై ఎలాంటి లావాదేవీలూ జరపవద్దని రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసింది.

## రేవంత్‌కు కేసీఆర్‌ను తిట్టుడే పని

**కొడిమ్యాల, -నవభూమి:** సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని మరిచిపోయాడని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. రేవంత్ పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందక రాష్ట్రం అధోగతి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై త్వరలో సదస్సు నిర్వహించి నిజాలను ప్రజలకు వివరిస్తామని స్పష్టం చేశారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలోని బృందావన్ రిసార్ట్ వేదికగా కాంగ్రెస్, బీజేపీ నుంచి కొండాపూర్‌కు చెందిన కందుల రమణారెడ్డి, గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఏడెల్లి పరశురాములుతోపాటు పలువురు యువకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వినోద్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో బూతులు మాట్లాడే వారిలో సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే ముందున్నారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా దాటవేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే సత్యం కొండగట్టు అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో కల్లాల్లో ధాన్యం తడుస్తుంటే పట్టించుకునే నాదుడే కరువయ్యాడని, రైతుల సన్న వడ్లకు బోనస్ లేదని, రైతు బంధు రావడం లేదని, రుణమాఫీ కాలేదని తెలిపారు.



### అభివృద్ధిపై చర్చించే దమ్ము లేక.. బీఆర్ఎస్ నేతలపై

# కాంగ్రెస్ నాయకుల దాడి

**ధర్మారం, -నవభూమి:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండలంలో జరిగిన అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధమైన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడికి ప్రయత్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణానికి దారితీసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర మంత్రిగా కొప్పుల ఈశ్వర్ మండలంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేసి.. చర్చకు సిద్ధంగా ఉండాలని సవాల్ చేశారు. దీనిపై స్పందించిన బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధమేనని అందుకు ఇవాళ మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వేదిక అని ప్రకటించారు. ఈ క్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుర్రం మోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పూస్కురు రామారావు, పాకాల రాజయ్య, ఆవుల శ్రీనివాస్, ఆవుల వేణు, మహిళా నాయకురాలు ఆవుల లత, మార్క సంధ్య, కాంపల్లి అపర్ణ తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నాయకుడు రామారావు ఇంటి నుంచి ర్యాలీగా గులాబీ శ్రేణులు అంబేద్కర్ చౌరస్తా వరకు బయలుదేరారు. ర్యాలీ చేస్తున్న గ్రామంలో మార్గమధ్యంలోనే ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, రామారావు తదితర నాయకులను పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. మిగతా గులాబీ శ్రేణులు పెద్ద సంఖ్యలో అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. వారంతా కరీంనగర్ -రాయపట్నం రహదారిపై రాస్తారోకో చేసే ప్రయత్నం చేయగా.. ఎస్సై శీలం లక్ష్మణ్‌తోపాటు పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. ప్రెస్ మీట్ నిర్వహించి.. ఇక్కడ నుంచి వెళ్లాలని కాగా సీఐ మాత్రం మిగతా ముఖ్య నాయకులను కేడీసీసీ బ్యాంకు వద్ద నిలిపివేసి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంబేద్కర్ చౌరస్తాకు వెళ్ళవద్దని ప్రెస్ మీట్ నిర్వహించి అభివృద్ధిపై చెప్పి ఇక్కడ నుంచి వెళ్లాలని వారికి సర్ది చెప్పారు. దీంతో ఆ ముఖ్య నాయకుల పిలుపు మేరకు అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులంతా కేడీసీసీ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించడానికి సిద్ధమవుతున్న క్రమంలో వారిని చూసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ చౌరస్తా నుంచి మూకుమ్మడిగా బీఆర్ఎస్ నాయకుల వద్దకు దౌర్జన్యపూరితంగా దూసుకు వచ్చారు. అభివృద్ధిపై నంది మేడారంలో చర్చించడానికి సిద్ధమని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ వ్యూహాన్ని మార్చి బీఆర్ఎస్ నాయకులపై దౌర్జన్యం చేసే ప్రయత్నానికి పూనుకున్నారు. అభివృద్ధిపై చర్చించే ప్రక్రియను పక్కన పెట్టిన ఆ పార్టీ నాయకులు ఒక దశలో ఒక గులాబీ శ్రేణులపై దాడి చేయడానికి తీవ్ర ప్రయత్నం చేసి ఘర్షణ వాతావరణం సృష్టించారు. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకోవడంతో తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఒక దశలో తీవ్ర సాయి ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దీంతో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ కుమార్ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులను అదుపు చేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. ఇరు వర్గాలను చెదరగొట్టి అంత దూరం పంపించగానే మళ్లీ నినాదాలు చేస్తూ ఒకరిపై ఒకరు దాడికి దిగే ప్రయత్నం చేశారు. దీంతో పోలీస్ సిబ్బంది రోప్‌తో కాంగ్రెస్ పార్టీ నాయకులను అదుపు చేయడానికి ప్రయత్నం చేశారు. కానీ పోలీసులను నెట్టుకుంటూనే కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుకు రాసాగారు. దీంతో కరీంనగర్ రాయపట్నం రహదారిపై సుమారు గంటసేపు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అభివృద్ధిపై చర్చించే దమ్ము లేక దాడికి..ఇక్కడ నేడు (మంగళవారం) వారసంత కావడంతో రోడ్డుమీద ఇరు పార్టీలు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసు అధికారులు ఇరు



వర్గాలను శాంతింపజేశారు. బీఆర్ఎస్ నాయకులను పాత బస్టాండ్ వైపు, కాంగ్రెస్ పార్టీ నాయకులను అంబేద్కర్ చౌరస్తా వైపుకు మళ్లించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ మీడియాతో మాట్లాడి కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించారు. తమ నేత రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మారం మండలంలో 10 సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధిపై చర్చించే దమ్ము లేక తమపై ఆ పార్టీ నాయకులు దాడికి దిగే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. తాము కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యానికి భయపడే ప్రసక్తి లేదని తామంత తమ పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్, రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వారసులమని ఆయన పేర్కొన్నారు. తాము గులాబీ సైనికులమని ఎవరికి భయపడే ప్రసక్తే లేదని ఈశ్వర్ స్పష్టం చేశారు. అభివృద్ధిపై ఎప్పుడైనా చర్చించడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందని విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు గమనించాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు సవాళ్లను స్వీకరించే ధైర్యం లేక..ప్రజల ఆదరణతో రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గ్రామ గ్రామాన అభివృద్ధి చేసిన మార్కు ఉందని ఆయన అన్నారు. ఏ ఊరిలోనైనా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు శ్రీధర్ స్పష్టం చేశారు. కానీ అభివృద్ధి నిరోధకులుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ సవాళ్లను స్వీకరించే ధైర్యం లేక, ఎదుర్కోలేక దౌర్జన్య పూరితంగా వ్యవహరించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ధర్మారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ఉన్న ఈశ్వర్ చర్చించి దానిని మంజూరు చేయించారని శ్రీధర్ గుర్తు చేశారు. తగినన్ని నిధులు కేటాయించి అట్టి జూనియర్ కళాశాలకు పక్కా భవనం ప్రహరీ గోడ నిర్మించడానికి ఈశ్వర్ కృషి చేశాడని ఆయన తెలిపారు. ధర్మారం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడంతో మండల కేంద్రానికి కొత్త కళ తీసుకువచ్చిన చరిత్ర ఈశ్వర్‌దేనని ఆయన వివరించారు. నంది మేడారం గ్రామాన్ని కొప్పుల ఈశ్వర్ సమగ్రంగా అభివృద్ధి చేశారని.. గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధంగా నంది రిజర్వాయర్ నిర్మించి రైతులకు మేలు చేశారని అన్నారు. గ్రామంలో పార్కు అభివృద్ధి, బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేసి గ్రామాన్ని అభివృద్ధి చేశారని శ్రీధర్ వివరించారు. మండల కేంద్రంలో ఎర్రగుంటపల్లి శివారు నుంచి జక్కన్న పల్లి వరకు 4 లేన్ల రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయించగా.. అట్టి రోడ్డు విస్తరణ కాకుండా ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ అడ్డుకున్నారని శ్రీధర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని ఇప్పటికీ ప్రారంభించకుండా ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నారని శ్రీధర్ ఆరోపించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధృవీకరణ పత్రాలు ఉండాలి..ప్రైవేట్ బస్సు యజమానులకు డీటీవో సూచన

**కోరుట్ల, -నవభూమి:** ప్రైవేట్ స్కూల్ బస్సుల యజమానులు అన్ని రకాల వాహన సంబంధిత ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని జిల్లా రవాణాశాఖాధికారి భద్రు నాయక్ అన్నారు. పట్టణంలోని ఆర్టీవో యూనిట్ కార్యాలయంలో సోమవారం కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల ప్రైవేట్ స్కూల్ యాజమానులతో డీటీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూల్ బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్, పర్మిట్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, టాక్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ స్కూల్ బస్సులో హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ పొంది కనీసం ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలన్నారు. 60 ఏళ్లు పైబడిన డ్రైవర్లను నియమించరాదన్నారు. బస్సుల్లో మెడికల్ ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఫైర్ ఎగ్జిట్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. స్కూల్ బస్సులపై యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీవో హెచ్చరించారు. ఈ సమావేశంలో కోరుట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు గిరీష్, వజ్ర, రవాణా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

